# ఎంటెక్ కోర్సుల ఫీజుల పెంపు?

ఐఐటీల్లో ఎంటెక్‌లో చేరి.. మధ్యలోనే మానేసి వెళ్లిపోతున్న వారి సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ఆ కోర్సు వార్షిక రుసుం భారీగా పెంచాలని ఐఐటీలు ప్రతిపాదిస్తున్నాయి. తద్వారా కోర్సును అర్ధంతరంగా మానుకోకుండా ఉంటారని ముగ్గురు ఐఐటీ నిపుణుల కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో సుమారు 8 వేల ఎంటెక్ సీట్లుండగా ఏటా 20శాతం మంది మధ్యలోనే కోర్సు మానేస్తున్నారు. దీంతో ఆ సీట్లు మళ్లీ ఇతరులతో భర్తీ చేయకుండా మిగిలిపోతున్నాయి. ఈ అంశంపై కేంద్రం నియమించిన కమిటీ ఇటీవల నివేదికను అందజేయగా దీనిపై శుక్రవారం దిల్లీలో జరిగే ఐఐటీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## నాలుగు ప్రధాన సిఫార్సులు

- ఎంటెక్ ఫీజు పెంచాలి. బీటెక్ మాదిరి ఏడాదికి కనీసం రూ.2 లక్షలు చేయాలి. ప్రస్తుతం ఎంటెక్‌కు రూ.1.15 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు (ఐఐటీలను బట్టి మారుతుంది) ఉంది. పేద విద్యార్థులకు కేంద్రం ఆర్థిక సహకారం లేదా విద్యా రుణం ఇప్పించాలి.
- ప్రస్తుతం ఎంటెక్ విద్యార్థులకు టీచింగ్ అసిస్టెంట్‌షిప్ (ఆచార్యులకు సహకారం) కింద నెలకు రూ.12,400 అందిస్తున్నారు. దాన్ని నిలిపేసి ఆ మొత్తాన్ని ఆయా శాఖలకు ఇస్తే ప్రతిభ చూపేవారికి, కోరుకున్న వారికి మాత్రమే ఇవ్వొచ్చు. ఈ నిధులను ఇతర కార్యకలాపాలకు వినియోగించుకోవచ్చు.
- గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్టు ఇన్ ఇంజినీరింగ్(గేట్)లో విభాగాలవారీగా మొదటి 1 పర్సంటైల్‌లో నిలిచి.. వారు పీహెచ్‌డీల్లో ప్రవేశం పొందితే ఐదేళ్లపాటు పూర్తిగా ఫెలోషిప్ అందించాలి.
- పరిశ్రమలు, సంస్థల నుంచి విద్యార్థులను స్పాన్సర్ చేయడాన్ని ప్రోత్సహించాలి. ఈ నాలుగు సిఫారసులు అమలు చేస్తే డ్రాపవుట్లను తగ్గించొచ్చు.

- ఈనాడు, హైదరాబాద్